క్లుప్తంగా

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



హసన్‌పర్తి: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హసన్‌పర్తి మండలం అన్నాసాగరానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 25, 26వ తేదీల్లో గోవాలో జరిగిన పోటీల్లో 15 ఏళ్ల విభాగంలో బండా ఆదిత్యారెడ్డి, 12 ఏళ్ల విభాగంలో బండా వివన్స్‌రెడ్డి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ పాపయ్య వివరించారు. ఈమేరకు ఇండియా అథ్లెటిక్ హెడ్ కోచ్ జయదేవ్ శర్మ చేతుల మీదుగా వారు బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు స్థానికులు అభినందించారు.

గోపాలశాస్త్రికి డాక్టరేట్



హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురానికి చెందిన వెంకట గోపాలశాస్త్రికి నగరంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఫిజికల్ అండ్ ఫైనాన్షియల్ పర్ఫ మెన్స్ ఆఫ్ ఎస్‌బీఐ – ఏ సెలక్ట్ స్టడీ' అనే అంశంపై కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట జనార్దన్ రావు పర్యవేక్షణలో పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని గోపాలశాస్త్రి సమర్పించారు. ప్రస్తుతం వెంకట గోపాలశాస్త్రి చైతన్య పీజీ అండ్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

1న ప్రవేశ పరీక్షలపై అవగాహన

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లోని స్పార్క్ అకాడమీ ఆధ్వర్యంలో నగరంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎప్‌సెట్, జేఈఈ, నీట్ లాంటి ప్రవేశ పరీక్షలపై ఉచిత అవగాహన కార్యక్రమం, సెమినార్‌ను హనుమకొండలోని బస్టాండ్‌రోడ్డులోని శ్రేయహోటల్ బాంక్వెట్ హాల్‌లో జూన్1వ తేదీన నిర్వహించనున్నట్లు స్పార్క్ అకాడమీ డైరెక్టర్ యశస్వి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9, 10, 11, 12వ తరగతుల విద్యార్థుల కోసం సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీసీ, బీపీసీ స్ట్రీమ్‌లను అభ్యసిస్తున్న వారు, ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. వివరాలకు 91333 80172 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రాష్ట్రంలో కులగణన చేయాలి

కాజీపేట: పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కులగణన కమిషన్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాస్త్రీయమైన కులగణన చేయడం ద్వారానే భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఉండవన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జూజుల శ్రీనివాస్‌తో కలిసి మంత్రులకు వినతి పత్రాలు అందజేసినట్లు రవికృష్ణ గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మడికొండ శివారులో జరిగింది. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం బిహార్ రాష్ట్రానికి చెందిన శ్రావణ్ సోని (36) పనినిమిత్తం బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మడికొండకు వచ్చి తిరిగి రాంపూర్ ఇండస్ట్రియల్‌కు వెళ్తుండగా రౌట్టెబండ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన శ్రావణ్ సోనిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై రాజబాబు తెలిపారు. మృతుడి అన్న మోహన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాకతీయులను అవమానించినట్లే

ఖిలా వరంగల్: తెలంగాణ రాజముద్రనుంచి కాకతీయ కళా తోరణాన్ని తొలగిస్తే 300 ఏళ్ల పాటు ప్రజా రంజక పాలన చేసిన కాకతీయులను అవమాన పర్చినట్లేనని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తక్షణమే వెనిక్కి తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాన్ని ఖండిస్తూ గురువారం ఖిలా వరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోని కాకతీయుల తోరణం ఎదుట బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు నిరసన తెలిపారు.

ఇద్దరు జవాన్లపై వేటు

హసన్‌పర్తి: అసభ్య పదజాలంతో దూషణ, నెలవారీగా జీతంలో రూ.500 మాముళ్ల వసూలు, ఏళ్ల తరబడి వేధింపులతో పారిశుద్ధ్య జవాన్లతో వేగలేకపోతున్నామని కడుపు మండిన పారిశుద్ధ్య కార్మికులు వాపోయారు. ఈమేరకు కార్మికుల కోసం బల్దియా ఏర్పాటు చేసిన ఇంటర్ సెల్ కాప్లిమెంటరీ కమిటీకి బాధితులు ఫిర్యాదు చేశారు. బల్దియా ప్రజారోగ్య అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఆ ఇద్దరు ఔట్ సోర్సింగ్ జవాన్లపై బదిలీ వేటువేశారు. బల్దియా పరిధిలోని 66వ డివిజన్‌లోని హసన్‌పర్తికి చెందిన ఔట్ సోర్సింగ్ జవాన్లు భిక్షపతి, సుజాత దీర్ఘకాలంగా స్థానికంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు జవాన్ల మధ్య ఆధిపత్య పోరుతో టార్గెట్ చేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు బాధిత పారిశుద్ధ్య కార్మికులు ఫిర్యాదు చేశారు.

నిబంధనలు బేఖాతర్

- వరంగల్ జిల్లా బాలల సంరక్షణ దత్తత విభాగం తీరుతో ఆగమాగం
- సకాలంలో సమర్పించని గృహ సందర్శన నివేదికలు
- పిల్లలను పోషించే సీనియార్టీ కోల్పోతున్న దంపతులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

సాక్షి, వరంగల్: 'కడుపున మోయకున్నా గుండెల్లో దాచుకుని పెంచుకుంటున్నాం.. పేగుబంధం కాకున్నా కంటి పాపలా చూసుకున్నాం.. దయచేసి మా బిడ్డను తీసుకెళ్లొద్దంటూ అక్రమ పద్ధతిలో పిల్లలను కొనుగోలు చేసిన దంపతులు ఇటీవల రాచకొండ పోలీసులకు మొరపెట్టుకున్నారు. చట్టబద్ధంగానే పిల్లలను దత్తత తీసుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి అన్నారు. చట్టబద్ధంగా దత్తత తీసుకునేందుకు ముందుకొస్తున్న వారు మాత్రం కొందరు అడాప్షన్ అధికారుల తీరుతో విసుగెత్తిపోతున్నారు. ఈ కోవలోకే వస్తుంది జిల్లా బాలల సంరక్షణ విభాగంలోని అడాప్షన్ సెక్షన్ తీరు. ఈ అధికారుల తీరుతో అక్రమ పద్ధతిలోనే దత్తతకు చాలామంది మొగ్గు చూపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. చట్టపరమైన రీతిలో దత్తతకు ముందుకొస్తే సమయానికి గృహ సందర్శన నివేదికలు ఇవ్వడం లేదు. దీంతో వారు పిల్లలను పోషించుకునే సినీయార్టీ కోల్పోతున్నారు.

నివేదిక పంపించకుండా తాత్సారం

బాలల న్యాయ చట్టం –2015 ప్రకారం కేంద్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) ద్వారా బాలలను దత్తత తీసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కారా.నిక్.ఇన్ ను అందుబాటులోకి తెచ్చింది. దంపతుల వయసు నిర్ధారణను బట్టి అర్హత గల శిశువులను దత్తత ఇస్తారు. శిశువుల దత్తత కోసం దంపతులు చేసుకున్న దరఖాస్తును పరిశీలించి గృహ సందర్శన (హోం స్టడీ) నివేదికను సిద్ధం చేసి కారా వెబ్‌సైట్ డేటాలో నమోదు చేస్తారు. ఈ నివేదిక మూడు సంవత్సరాల కాలపరిమితి ఉంటుంది. ఈలోగా శిశువును దత్తత తీసుకోకుంటే మళ్లీ మూడు సంవత్సరాల అనంతరం వారికిచ్చే లాగిన్ ఐడీ ద్వారా గృహ సందర్శన నివేదికను రెన్యూవల్ చేయాలని, తిరిగి నిర్వహించాలని, రీవ్యాలిడేషన్ చేయాలని అధికారులను విజ్ఞప్తి చేస్తారు. అనంతరం 60 రోజుల్లో నివేదికను తయారుచేసి వెబ్‌సైట్‌లో



అప్‌లోడ్ చేయాలి. కానీ, అందుకు భిన్నంగా జిల్లా బాలల సంరక్షణ దత్తత సెక్షన్ అధికారి మాత్రం రీవ్యాలిడేషన్ చేసి రెండు సంవత్సరాలు అయినా గృహ సందర్శన నివేదిక పంపకుండా తాత్సారం చేశారు. దీంతో ఆ అధికారి నిర్లక్ష్యం పిల్లలు లేనివారికి శాపంగా మారిందని పలు ఆరోపణలు వస్తున్నాయి.

మేం ఎందుకు వద్దంటాం..

రాయపర్తి మండలానికి చెందిన మురుపోజు రాంబాబు, సవిత దంపతులకు 29 సంవత్సరాల క్రితం వివాహమైంది. 2019లో పాపను దత్తత తీసుకోవాలని భావిస్తే ఈ విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారులు వచ్చి వారికి కౌన్సెలింగ్ చేశారు. చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని చెప్పడంతో 2019 ఫిబ్రవరి 9న ఆడశిశువు కావాలని కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు గృహ సందర్శన నివేదికను సిద్ధం చేసి అప్‌లోడ్ చేశారు. మూడేళ్లు దాటినా శిశువు దత్తత రాకపోవడంతో 2022 డిసెంబర్ 6న గృహ సందర్శన నివేదికను తిరిగి రూపొందించాలని తమ లాగిన్ ద్వారా రీవ్యాలిడేషన్‌కు రిక్వెస్ట్ పంపామని ఆ దంపతులు తెలిపారు. బాలల సంరక్షణ విభాగం నుంచి అడాప్షన్ సెక్షన్ అధికారి సరిత రీవ్యాలిడేషన్ రిక్వెస్ట్ పెట్టిన 60 రోజుల్లోపు గృహ సందర్శన నివేదిక సిద్ధం చేసి అధికారులకు పంపాలి. కానీ, సదరు అధికారి గృహ సందర్శన నివేదిక సిద్ధం చేయలేదు. దీంతో వారు సీనియార్టీ కోల్పోయారు. 'ఇటీవల ఆ అధికారి ఫోన్ చేసి మీకు 4



నుంచి 6 సంవత్సరాల పాప వస్తుందని చెప్పింది. మాకు చిన్న పాప దత్తత కావాలని దరఖాస్తు చేస్తే పెద్ద పాప ఎలా ఇస్తారని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు' అని వారు వాపోయారు. 'రాంబాబు దంపతులకు దత్తత ఇష్టం లేదని 2024 ఏప్రిల్ 19న కారా అధికారులకు మా అనుమతి లేకుండానే ఈమెయిల్ ద్వారా సమాచారం పంపించారని తెలియడంతో నిర్ఘాంతపోయాం. దత్తత అవసరం లేదని దత్తత సెక్షన్ అధికారి సరిత పై అధికారులకు తప్పుడు ఈమెయిల్ పెట్టారని కలెక్టర్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతివెస్లీ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, ఢిల్లీలోని దత్తత అధికారులకు ఈనెల 24న ఫిర్యాదు చేశాం. తమకు అన్యాయం చేసిన అధికారులపై చర్య తీసుకోవాలని, చట్టబద్ధంగా శిశువు దత్తత ఇచ్చేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశాం' అని రాంబాబు, సవిత దంపతులు పేర్కొన్నారు.

పచ్చిరొట్టతో భూమి సారవంతం

ఖిలా వరంగల్: పచ్చిరొట్ట ఎరువుతోనే భూమి మరింత సారవంతమవుతుందని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉషాదయాళ్ అన్నారు. జిల్లాలోని పీఏసీఎస్ గోదాముల్లో 60శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచామని తెలిపారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో జీలుగ, ఎరువుల నిల్వలు, రికార్డులను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఉషాదయాళ్ మాట్లాడుతూ రైతులు తమ పంటపొలాల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, పచ్చిరొట్ట ఎరువు జీలుగను పంట పొలాల్లో వేసుకుంటే దిగుబడి పెరుగుతుందని సూచించారు. అన్ని మండల కేంద్రాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాల్లో జీలుగ విత్తనాలు ఉన్నాయని వివరించారు. జిల్లాకు 4వేల క్వింటాళ్లు కేటాయించగా ఇప్పటికే 2,500 క్వింటాళ్లు వచ్చినట్లు పేర్కొన్నారు. 30 కిలోల బస్తాకు రాయితీ మినహాయిస్తే రూ.1,116 రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పత్తిలో హైబ్రిడ్ బీజీ -2 రకం విత్తనాలు కూడా మంచి దిగుబడి ఇస్తాయని చెప్పారు. మేలైన యాజమాన్యం పద్ధతులతో 90 శాతం దిగుబడి, విత్తన ఎంపికతో 10 శాతం మాత్రమే దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. రైతులు నేల స్వభావాన్ని



విత్తనాల నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉషాదయాళ్

బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 6 లక్షల ప్యాకెట్లకు పైగా పత్తి విత్తనాలు అవసరం ఉంటాయని, ఇప్పటికే 3.60 లక్షల ప్యాకెట్లు మార్కెట్‌లోకి వచ్చాయని తెలిపారు. రైతులు విత్తన ప్యాకెట్ బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకూ భద్రపరుచుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ వద్ద మాత్రమే సీల్డ్ ప్యాకెట్ గల విత్తనాలు కొనుగోలు చేయాలని, రాత్రివేళ అమ్మిన వారి నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దని కోరారు. ఎవరైనా అలా అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్, పి.సారంగం, సీహెచ్.కృష్ణారెడ్డి, ఏఓ విజ్ఞాన్, ఏఈఓ చంద్రకాంత్ పాల్గొన్నారు.

కార్మికుల కోసం సీఐటీయూ పోరాటం



జెండా ఆవిష్కరిస్తున్న రాగుల రమేష్



జెండా ఆవిష్కరిస్తున్న రామస్వామి

కేయూ క్యాంపస్: కార్మికుల హక్కుల కోసం పోరాడేది సీఐటీయూ మాత్రమే అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ సీఐటీయూ అనేక విజయాలు సాధించిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ విధానం తీసుకొచ్చి తక్కువ వేతనాలతో పనిచేయిస్తోందని ఆందోళన వ్యక్తం చేవారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలకు నిరసనగా రాబోయే కాలంలో సమరశీల పోరాటాలకు కార్మిక సంఘాలు సిద్ధ కావాలని రమేష్ పిలుపునిచ్చారు. సీఐటీయూ యూనివర్సిటీస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి, యూనివర్సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంచందర్, దేశిని రవికుమార్, బాధ్యులు పల్లం రాజు, సంఘాల రాజు, రాజేందర్, సందీప్, శోభ, కృష్ణ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ఖిలా వరంగల్: సీఐటీయూ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ పనిచేస్తోందని, సమస్యలపై పోరాటాలు చేస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో గున్నాల ప్రభాకర్, సాజియా, మద్దూరి రవీందర్, కిరణ్, గోపాల్, సదానందం, మల్లేశం, మురళి, రాజ్‌కుమార్, ఇస్మాయిల్, లక్ష్మి, జుబేదా, భాగ్య, యాదగిరి, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

హన్మకొండ: ఆటో కార్మికుల కోసం ప్రత్యేక ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల కుటుంబాలకు నెలకు రూ.15 వేల భృతి ఇవ్వాలని, కార్మిక భవన్ నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కార్మికులందరికి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ నాయిని రవి మాట్లాడుతూ ఈనెల 31న ఉదయం గంటలకు



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పుల్ల శ్రీనివాస్, ఎంజాల మల్లేశం, రవీందర్ రెడ్డి, తేలు సారంగపాణి, కాసోజ్ ప్రవీణ్, జన్ను సంజీవ, శ్రీధర్ రెడ్డి, అరుణ్ కుమార్, కాటపురపు రాజు, భిక్షపతి, కృష్ణ, ఎస్.రవి, పలు సంఘాల కార్మిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లోగో మార్పు నిర్ణయం సరికాదు



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

హన్మకొండ: తెలంగాణ ప్రభుత్వ లోగో మార్పును కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేసేలా ఉన్న కాకతీయ తోరణం, చార్మినార్ గుర్తులను తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆందోళ వ్యక్తం చేశారు. ప్రజల అభీష్టం మేరకు పాలన కొనసాగించాలని సూచించారు. లోగో మార్పు నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నయీమొద్దీన్, చాగంటి రమేష్, బొల్లు రవి, మహమూద్, సంపత్, ఇస్మాయిల్, సందీప్, రాజేశ్వర్, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

బండ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మడికొండ: మడికొండలో బండ మైసమ్మ ఆలయంలో వడ్డెర కులస్తులు ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి బోనాలతో మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటారు. శుక్రవారం యాటపోతులతో బలిహరణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కులసంఘం పెద్దలు యాదగిరి, రజిత, సిరిచందన, రాజేందర్, స్వరూప, మధు, సింధు, హరీష్, శ్రీహర్ష, ప్రభావతి, శివాని, మహేష్, రజిత, కావ్యశ్రీ, హసిని, శివకార్తీక్, పోచమ్మ, ప్రశాంత్, వర్ష, అనిల్, తనూజ్, వెంకన్న, నిర్మాల, భరత్, భార్గవి, రాజేశ్వరి, ఐలేష్, దేవి, బాలమణి, చరణ్, రవి, సుశీల, సమ్మయ్య, యాదమ్మ, వెంకటస్వామి, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల ర్యాలీ



కాజీపేట: కాజీపేట పట్టణ పుర వీధుల్లో దక్షిణ ముఖాంజనేయ స్వామి దేవాలయ భక్తులు గురువారం రాత్రి ఆంజనేయుడి భారీ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా యాదాద్రి జిల్లా నుంచి తెప్పించిన హనుమంతుడి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై అలంకరించి జై శ్రీరాం నినాదాలతో హోరెత్తించారు. గిరిజన కళాకారులు, కోలాట బృందం, చెక్క భజనల కళాకారుల నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. వందలాది మంది హనుమాన్ మాలధారులు, భక్తుల కోలాహలం మధ్య ఊరేగింపు ఘనంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, దాతలు పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో నగర సంకీర్తన



కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని న్యూశాయంపేటలో గురువారం శ్రీభక్తాంజనేయ కుటీరం ఆధ్వర్యంలో హనుమాన్ నగర సంకీర్తనను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా నగర సంకీర్తన ర్యాలీ కార్యక్రమాన్ని హనుమాన్ మాలధారులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి



హసన్‌పర్తి: మంత్రిని కలిసిన ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు కోరారు. ఈమేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలోని 32 గ్రామాలు కార్పొరేషన్ విలీనమయ్యాయని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆ గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. విలీన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మల్లారెడ్డిపల్లి – సూదన్‌పల్లి గ్రామాల మధ్య నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అఖండ రామనామ పారాయణం

హన్మకొండ అర్బన్: హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో వైభవంగా అఖండ రామనామ పారాయణం నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి మాన్యసూక్త హోమం, గోత్రనామార్చన నిర్వహించి తీర్థప్రసాదాలు సమర్పించారు. అనంతరం 24 గంటల అఖండ రామనామ పారాయణం, ఏలూరు బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 7గంటలకు హనుమాన్ మాలధారణ స్వాములతో ప్రసన్నాంజేయస్వామి



పారాయణంలో పాల్గొన్న మాలధారులు

దేవాలయం నుంచి హనుమకొండ చౌరస్తా మీదుగా తిరిగి దేవాలయం వరకు నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బెండల అర్జున్‌రావు, హనుమద్గిరి హనుమాన్ దీక్ష అన్నదాన సేవా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గండె కృష్ణ, కె.రవికుమార్, సభ్యులు అంబటి నరేందర్, ఎం.మొగులయ్య, దశరథ్‌కుమార్, సుధాకర్, హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

రామన్నపేట: గోవధ నియంత్రణకు ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు విశ్వహిందు పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నగరంలోని మట్టివాడ, మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లకు గురువారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాల్లో గోవుల అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోందని, గోవధ నిషేధ చట్టం ఉన్నా అక్రమ రవాణాదారులు ఏమాత్రం భయపడకుండా ఆవులు, గేదెలను అక్రమంగా రవాణా చేస్తూ దారుణంగా, కిరాతకంగా వధిస్తున్నారని వాపోయారు. ఆరోగ్యకరమైన పశువులను వధించకూడదని గోవధ నిషేధ చట్టం –1977 చెబుతున్నా దొంగచాటుగా అక్రమ దందా కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ అధ్యక్షుడు బొమ్మ నాగరాజ్, గోరక్ష ప్రముఖ్ సంగినేని రాజేష్, ఖిలా ప్రఖండ భజరంగ్ దళ్ సంయోజక్ తుంగ సతీష్, పల్లె ప్రదీప్‌గౌడ్, ఎల్లం భరత్, విఠల్‌రెడ్డి, శ్రీకర్, శేఖర్, ప్రవీణ్, రవి, భజరంగ్ దళ్ గోరక్ష కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ గోపికి వినతి పత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

ఎమ్మెల్యే నాగరాజు దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు దిష్టిబొమ్మను స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ ఈనెల 29న గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ స్వేరోస్ గూండాలను తయారు చేస్తున్నారని అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఈక్రమంలో ప్రవీణ్‌కుమార్‌కు నాగరాజు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్వేరో స్టూడెంట్స్ యూనియన్ బాధ్యులు సాత్విక్, సాయి, రత్నాకర్, నరేష్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

స్వేరోస్‌కు క్షమాపణ చెప్పాలి

నయీంనగర్: స్వేరోస్‌కు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఉద్యమాలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర స్వేరోస్ ప్రధాన కార్యదర్శి దారమల్ల ప్రకాష్ హెచ్చరించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వేరోస్‌ను గుండాలతో పోల్చుతూ కించపరిచే వ్యాఖ్యలు ఎమ్మెల్యే నాగరాజు చేశారని అన్నారు. స్వలాభం కోసం స్వేరోస్‌ను గూండాలు అనడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మనోజ్, రమాకాంత్, సాయికుమార్, పూర్ణ, చంటి, చందు పాల్గొన్నారు.

శ్రీధర్ బాబు పుట్టిన రోజు వేడుకలు

హన్మకొండ: హనుమకొండ వడ్డెపల్లి శివారులోని శ్రీసాయి సేవా ట్రస్ట్ అనాథ, వృద్ధాశ్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర శాసనసభ వ్యవహారాలు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పుట్టిన రోజు వేడుకలను గురువారం జరుపుకున్నారు. శ్రీసాయి సేవా ట్రస్ట్ అనాథ విద్యార్థులతో కలిసి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ కేక్ కట్ చేశారు. అనంతరం అయిల్‌నేని సుశీలరావు, నవీన్ రావు సహకారంతో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. నాయిని లక్ష్మారెడ్డి, ఎర్రబెల్లి రఘు, కట్టా రఘుపాల్ రెడ్డి, కల్వల రాజా మల్లారెడ్డి పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ స్టేషన్ రోడ్డులోని విత్తన, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపుల్లో సోదాలు ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ గురువారం తనిఖీలు నిర్వహించారు. షాపుల్లోని విత్తన ప్యాకెట్లు, రికార్డులు, బిల్లులను తనిఖీ చేశారు. నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్ట్ రోడ్డులో..

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని సీడ్స్, అండ్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపులపై పోలీసులతో కలిసి మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సైలు ముస్సీరుల్లా, చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత



హసన్‌పర్తి: ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన వంగపహాడ్‌కు చెందిన కౌలు రైతు కన్నబోయిన సాంబయ్య కుటుంబానికి రూ.లక్ష విలువగల బీమా చెక్కును అందజేశారు. ఈమేరకు చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు సొసైటీ చైర్మన్ మేర్గు రాజేష్ గురువారం అందించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఇఫ్కో ఫర్టిలైజర్ (ఢిల్లీ) కంపెనీ తమ ఉత్పత్తులు వాడిన రైతులకు ప్రమాద బీమా వర్తింపజేస్తోందని వివరించారు. పీఏసీఎస్ ద్వారా విక్రయిస్తున్న ఎరువులు, పురుగుల మందులు వాడాలని సూచించారు. సొసైటీ అభివృద్ధికి రైతులు సహకారం అందించాలని కోరారు. కార్యకంమలో వైస్ చైర్మన్ రాజ్‌కుమార్, డైరెక్టర్ తెట్టె గణేష్, సీఈఓ రాజిరెడ్డి, పరమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.